

# వైకుంఠయాత్ర

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

24

**మర్నాడంతా ఇంట్లో** వున్నాడు శివాజీ.

నలుగురూ పేకాట ఆడుతూ టీవీ చూస్తూ, కుటుంబ విషయాలు మాట్లాడుకుంటూ గడిపారు.

తన ఇంటి ఎదురుగా ఆగి ఉన్న వ్యానుని గుర్తించాడు చలపతి. అందులో హంతకులు ఉండవచ్చని కూడా అనుకున్నాడు. మామూలుగా అయితే పోలీసులకి ఫోను చేసి ఆ వ్యాన్లో ఉన్నవాళ్ళ మీద ఫిర్యాదు చేసేవాడేకానీ ఆ పని చేయలేదాయన.

వెన్నెలకి ఫోను చేసి మాట్లాడాలని వుంది శివాజీకి. కాని బయటికి వెళ్ళకపోవడంతో ఆ రోజు ఫోను చేయలేకపోయాడు బొంబాయికి. ఆదివారంనాడు అమ్మ వాళ్ళింటికి వచ్చిందా? ఎలా ఫీలైంది? ఏం మాట్లాడింది? మొదలైనవి తెలుసుకోవాలని వుంది అతనికి.

ఆ రాత్రి భోజనాలయ్యాక నిద్రపట్టేదాకా 'బ్రెయిన్‌విటా'ని ఒంటరిగా ఆడుతూ గడిపాడు శివాజీ.

25

కుమారస్వామి దగ్గరికి ఏసిపి వచ్చాడు.

"రండి. ఏమిటి విశేషం?" అడిగాడు. కుమారస్వామి ఏమీ తెలియనట్లే.

"మీకు తెలియనిదేముంది? పవన్ మీ మీద ఫిర్యాదు చేశాడు, రెండోసారి కూడా మీరు అతని మీద హత్యాప్రయత్నం చేశారని."

"పేపర్లో చదివాను. ఆ హోటల్లో నేను మారుపేరుతో గది తీసుకున్నానన్న రుజువు మీ దగ్గర వుందా?" అడిగాడు కుమారస్వామి.

"లేదు."

"పోనీ అతను తాగిన విషం నేను కొన్నానని గాని, నేను తాగించానని కాని రుజువు వుందా?"

"అదీ లేదు."

"నా మనుషులు అంటున్నాడే తప్ప అతను వాళ్ళెవరో ఐడెంటిటీ పెరేడ్‌లో గుర్తుపట్టగలిగాడా?"

"లేదు."

"ఆ రాత్రి ఫోనులో అతనితో మాట్లాడానని అంటున్నారు కదా. పోనీ కనీసం దానికైనా రుజువుందా?"

"ఊహూ."

"నేను ఒక హోటల్ గది అద్దెకి తీసుకుని, కొద్దిగా విషం తాగి, ముందుగానే నన్ను కాపాడటానికి వీలుగా హోటల్ మీద రెయిడ్ జరిగే ఏర్పాటు చేసుకుంటాను. హాస్పిటల్లో నేను కాపాడబడేలా చేసుకుని 'ఇదిగో, ఇది పవన్ పనే' అంటాను. అప్పుడు మీరు పవన్‌ని అరెస్ట్ చేస్తారా?"

"రుజువులు లేకుండా అరెస్ట్ చేయం."

"రేపు ఎన్నికల్లో మా పార్టీ నెగ్గి, నేను అధికారంలోకి వచ్చి హోం మినిస్టర్ని అవచ్చు. అతని పార్టీ నెగ్గితే అతను మినిస్టరు అవచ్చు. కాబట్టి ఊరికే గొడవ చేసి దాన్ని పేపర్లో రోజూ న్యూస్ ఐటం చేయాలనుకుంటున్న పవన్‌కి అటువంటి చౌకబారు పనులు మానుకోమని చెప్పండి. ముఖ్యంగా ఎలక్షన్ల ముందు."

"రొటీన్‌గా మీ స్టేట్‌మెంటు తీసుకోడానికి వచ్చానంతే."

"అతని అభియోగాలన్నీ నేను డిలై చేశానని రాసుకోండి. పవన్ బతికినా, చచ్చినా నాకు కలిగే లాభం కాని, నష్టం కాని ఏమీ లేదని రాసుకోండి."

"అలాగే సార్"

"ఆ రాంగోపాల్ హత్య విచారణ ఎంతదాకా వచ్చింది?"

"ఇంకా విచారణలోనే వుంది."

"మీరు బాగా విచారిస్తే అది పవన్ పనేనని తేలుతుంది."

ఏసిపి వెళ్ళాక కుమారస్వామి ఆ విషయం అంతటితో మర్చిపోయాడు.

## 26

మర్నాడు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ దగ్గర చలపతి చెప్పాడు.

"ఇవాళ సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ చూడవచ్చు నువ్వు వస్తావా?" అడిగాడు శివాజీ పవన్‌ని.

"నేను ఇవాళ ఎలక్షన్ కేంపైన్ పనిమీద పార్టీ ఆఫీస్‌కి వెళ్ళాలి" అపాలజిటిక్‌గా చెప్పాడు పవన్.

"ఇట్స్ ఓకె"

"ఎలా వెళతావు?" అడిగింది ఆదిలక్ష్మమ్మ.

"మాకు అక్కడ ఆటోలు వుండవు. ఆటోలో వెళతాను. అందులో ప్రయాణం తమాషాగా వుంటుంది" ఉత్సాహంగా చెప్పాడు శివాజీ.

ఆదిలక్ష్మమ్మ, చలపతి ఒకరివంక మరొకరు చూసుకున్నారు. ఆవిడ చూపులోని అర్థం గ్రహించి చెప్పాడు చలపతి.

"ఆటో మంచి ఐడియా. కానీ నిన్ను కారులో కాక ఆటోలో పంపించడం ఏమిటి?"

"ఫర్వాలేదు."

బ్రేక్‌ఫాస్ట్ అయ్యాక చలపతి వెళ్ళి చార్మినార్‌కి ఆటో మాట్లాడి తెచ్చాడు. శివాజీ ఎక్కిన ఆటో ఆ ఇంటి ఆవరణలో నుంచి బయటికి వెళ్ళగానే తమ ఇంటికి కొద్ది దూరంలో పార్కు చేసి ఉన్న వ్యాను కదలడం చూశాడు చలపతి.

తన ఊహ కరెక్టే అనుకున్నాడు. అది ఆటో తిరిగిన సందులోకే తిరగడంతో.

తన బ్రదర్ తన తరపున మరణించడం పవన్‌కి మనసులో బాధగానే వుంది.

వెనకాలే వ్యాన్లో ఆ ఆటోని ఫాలో అయిన తాతాచారి ఆ ఆటో నంబర్ని గుర్తుగా తన అరచేతిమీద రాసుకున్నాడు.

ఆటోలో ప్రయాణం నిజంగా తమాషాగా వుందనిపించింది శివాజీకి. అది ట్యాంక్‌బండ్ మీద వెళుతుండగా తన ఆటోని కిల్లర్ వ్యాను వెంబడిస్తోందని తెలియదు శివాజీకి. అతనికి అసలా భయమేలేదు.

ఆటో ట్యాంక్ బండ్ దాటి కొద్దిగా ముందుకి వెళ్ళాక ఎస్టిడి బూత్ కనిపించడంతో ఆటో డ్రైవరు భుజం తట్టి "ఏక్ బార్ యహా రోఖో ఫోను కర్నా హై" చెప్పాడు.

ఆటో ఆగగానే దిగి టెలిఫోను బూత్‌లోకి వెళ్ళి బొంబాయి నంబరు చెప్పాడు. ఆ ఆటోని వెంబడించే వ్యాను కూడా కొద్ది దూరంలో ఆగింది.

భయం లేనట్లుంది ఈ పవన్‌కి? ఒంటరిగా, బాడీగార్డ్స్ లేకుండా ఎలా నిర్భయంగా బయటికి వచ్చాడో" చెప్పాడు సూరి మిగిలిన ఇద్దరితో.

"కెన్ ఐ స్పీక్ టు వెన్నెల?" కనెక్షన్ రాగానే అడిగాడు.

"వెన్నెలా? ఒన్ సెకండ్."

వెన్నెల తల్లి రిసీవరు ఎత్తిందని గొంతుబట్టి గుర్తుపట్టాడు శివాజీ.

"హలో"

"అదృష్టం. నువ్వు బ్యూటీ పార్లర్‌కి ఈ పాటికి వెళ్ళిపోయి వుంటాననుకున్నాను."

"బయలుదేరుతుండగా ఫోను వచ్చింది. హైదరాబాద్ నుంచేనా?"

"అవును. మా అమ్మ ఆదివారం మీ ఇంటికి వచ్చిందా?"

"వచ్చింది. షి హేడ్ ఏ గుడ్ టైం."

"గ్లాడ్. ఆ రోజు ఏం జరిగిందో వివరంగా చెప్పు."

వెన్నెల వివరించాక తనకి, ఆవిడకి దారిలో జరిగిన సంభాషణ కూడా చెప్పింది.

"ఇల్లు చిన్నదని పెళ్ళయ్యాక మీరు దూరంగా వెళతారేమోనన్న భయం ఆవిడ మాటల్లో కనిపించింది. మనం ఆవిడతోనే కలిసి వుందాం."

"ష్యూర్ మా అమ్మకి ఆ భయం వుందని నాకు తెలీదు. మంచి సమాధానం చెప్పావు. ఇక్కడొక తమాషా జరిగింది."

"ఏమిటది?"

"పవన్, నేను చూడటానికి ఒకేలా వుంటామని నాకు మొదట చెప్పింది నువ్వే కదా?"

"అవును. మేగజైన్లో అతని ఫోటో చూసి నీదనుకున్నా కూడా. ఏం జరిగింది?"

"పవన్ అనుకుని అతని శత్రువులు నన్ను చంపబోయరు."

"వాట్? వివరంగా చెప్పండి" ఉలిక్కిపడి అడిగింది వెన్నెల కంగారుగా.

జరిగింది మొత్తం చెపుతుంటే భయంగా విన్నది వెన్నెల. మొత్తం విన్నాక చెప్పింది "ఎంతలో ప్రమాదం తప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో మధ్యపాన నిషేధ పెట్టకపోయినా, ఎక్సైజ్ వాళ్ళు ఆ హోటల్ మీద రెయిడ్ చేయకపోయిన మీ పని ఏమయ్యేది?"

"నా ఆటో బయోగ్రఫీలో ఇదొక ఎగ్జైటింగ్ చాప్టర్ అవుతుంది."

"మీరు వెంటనే బయలుదేరి బొంబాయి రాకపోతే మీ ఆటో బయోగ్రఫీ ఇంతటితో పూర్తవచ్చు. ఇక అక్కడ వుండకండి" భయంగా అంది వెన్నెల.

"అంత భయపడాల్సిన పనిలేదు."

"మీ ప్రాణాలమీద మీకన్నా నాకే ఎక్కువ హక్కుంది కాబట్టి నేను ఎంతయినా భయపడాల్సిన అవసరం ఉంది. వెంటనే బయలుదేరి రండి మహాశయా!"

"రెండు మూడు రోజుల్లో వస్తాను" చెప్పాడు.

"టేక్ కేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్."

"ష్యూర్ నేను మరణించబోతున్నానని ఆ హోటల్ గదిలో అనిపించినప్పుడు నాకు మా అమ్మ తర్వాత నువ్వు గుర్తుకు వచ్చావు తెలుసా?"

వెన్నెల మౌనంగా వుండిపోయింది.

"నువ్వు గుర్తొస్తే నాకప్పుడు ఏమనిపించిందో తెలుసా?"

"ఏమనిపించింది?"

"నిన్నొకసారి ముద్దు పెట్టుకోకుండా ఎంత తప్పుచేశానా అని."

గలగలా నవ్వింది వెన్నెల.

"హాయిగా నవ్వు. కాకపోతే అది పెదవులతో చేసే రెండో మంచిపని."

పెదవులతో చేసే మొదటి మంచి పని ఏదో శివాజీ చెప్పకపోవడంతో అందులోని కొంటెతనం అర్థం చేసుకున్నాక వెన్నెల అంది. "ఈ ప్రపంచంలో ముద్దు ఎంత ముచ్చటైనదయినా అది పెళ్ళయ్యాకే సుమా"

"నీకు తెలుసా, పెళ్ళికాకమునుపు తీసుకునే ముద్దు ముచ్చటకి ఎప్పుడూ గుట్టుగా వుంటుంది. తెలివయిన ప్రియుడు దాన్ని రట్టు కానీయడు."

"ఇంకా?"

"భార్యా భర్తల మధ్య ముద్దు ఆబ్లిగేషన్. లవర్స్ మధ్య ముద్దు టెంప్టేషన్. ఆబ్లిగేషన్ కన్నా టెంప్టేషన్‌లో అందం వుంది కదూ"

"ఇంకా?"

"అసలు ప్రేమ సారంగాన్ని తొలిచే డైన్ మేట్ ముద్దు. దాన్ని మనలాంటి ప్రేమికులు తప్పనిసరిగా వాడాలి. హనీమూన్ ఎప్పుడు పూర్తవుతుందంటే, 'ముద్దు' విధిగా మారినప్పుడు. పెళ్ళికి ముందు ముద్దులు 'విధి' కాదు, పెన్నిధి."

మళ్ళీ గలగలా నవ్వింది వెన్నెల.

"సో! నేను తిరిగి బొంబాయి వచ్చాక నాకు ఒక థాట్‌ఫుల్ గిఫ్ట్ యిస్తావా? అండ్ ఏ కిస్ ఈజ్ ఏ థాట్ ఫుల్ గిఫ్ట్."

"నథింగ్ ఆఫ్ దట్ సార్ట్."

"ఆలోచించు. మాటల్లో చెప్పలేని నా భావాలను పెదవులతో నీకు చెప్పగలిగే ఏకైక క్రియ ముద్దే, నా ముద్దమందారం"

"ఆశ"

"ముద్దు పెట్టుకోవడం అంటే చెవిలో బదులు నోట్లో గుసగుసలాడటమే. నాతో ఎన్నో ఊసులు గుసగుసలాడాలి."

మళ్ళీ గలగలా నవ్వింది వెన్నెల.

"దోజ్ గుస్‌గుసాస్ విల్ హేవ్ టు వెయిట్. ఎప్పుడు వస్తున్నారు?"

"నువ్వు ఎప్పుడు ముద్దు ఇస్తానంటే అప్పుడు."

"ఐ యాం మోర్ వర్రీడ్. మీరు వచ్చేదాకా రోజూ ఫోను చేస్తుండండి."

బ్లిస్ గురించి కాదు. నా మీద హత్యా ప్రయత్నం గురించి నే చెప్పేది."

"అలాగే."

"ఏదీ ఓ ముద్దు ఎస్టిడి ద్వారా విసురు. ఎలా వుందో చెప్తాను."

వెన్నెల అవతలి వైపు ఫోన్ పెట్టేసింది. కనెక్షన్ కట్ అయిందని తెలుసుకోగానే తను కూడా రిసీవర్ పెట్టేస్తూ మనసులో అనుకున్నాడు శివాజీ.

'ఈ ముద్దును కనిపెట్టినవాడు ఎవడోకాని, ఒట్టి మూర్ఖుడు.'

మూర్ఖుడయినా అయివుండాలి లేదా గట్టి మేధావి అయినా అయి వుండాలి.

శివాజీ ఎక్కిన ఆటో కదిలింది. తాతాచారి వ్యాను ఆ ఆటోను ఫాలో అవసాగింది. ఆటో సాలార్‌జంగ్ మ్యూజియం ముందు ఆగింది. దిగి డబ్బు చెల్లించి లోపలికి నడిచాడు శివాజీ.

అతను ఎక్కడికి వెళుతున్నాడో తెలియని తాతాచారి పవన్‌ని (శివాజీని) మరోసారి కిడ్నాప్ చేసే ఆలోచనలో వున్నాడు. ఆటోని వ్యానుతో ఢీకొడితే పవన్ మళ్ళీ గాయాలతో బయటపడవచ్చు. కొద్దిరోజులలో కోలుకోవచ్చు. అతను కారు డ్రయివర్ మరణించినట్లుగా ఆటో డ్రయివర్ మరణించి, పవన్ బతికితే కుమారస్వామి అగ్గిమీద గుగ్గిలం అవడం ఖాయం అని తాతాచారికి తెలుసు. అందుకే ఆ ప్రయత్నం చేయలేదు.

అదీకాక ఆ వ్యాను హత్యకి సాక్ష్యం అవుతుంది.

శివాజీ టిక్కెట్ కొని లోపలికి వెళ్ళాడు. తాతచారి, సూరి కూడా టిక్కెట్ కొని మ్యూజియంలోకి నడిచారు.

ఒక్కొక్క గదిలోని వస్తువులను చూస్తూ నడుస్తున్నాడు శివాజీ. వాటి అన్నిటి మీద అతనికి ఎంతో ఆసక్తి వుంది. టిప్పు సుల్తాన్ కరవాలం, ఛత్రపతి శివాజీ వాడిన దుస్తులు, ముందువైపు పురుషాకృతి వెనకవైపు స్త్రీ ఆకృతిగల విగ్రహం, మొఘల్ కాలంనాటి నాణాలు, కవచాలు, వందల ఏళ్ళ క్రితంనాటి పింగాణి సామగ్రి, మనిషి బొమ్మ తలుపు తెరుచుకుని బయటకి వచ్చి గడియారంలో గంటలు కొట్టడం.

శివాజీ తనను ఇద్దరు వ్యక్తులు అనుసరిస్తున్నారన్న సంగతి గమనించకుండా వాటిలో లీనమై ఒక గదులోంచి ఇంకొక గదిలోకి, ఒక అంతస్తులో నుంచి ఇంకొక అంతస్తులోకి వెళుతున్నాడు.

ఆయుధాల గదిలోని రకరకాల మారణాయుధాలు చూస్తూ చెప్పాడు సూరి "ఇవన్నీ ఎన్ని వేలమందిని చంపాయో కదా!"

"ఇక్కడేం చూశావ్? ఢిల్లీలోని పోలీస్ వాళ్ళ ఎగ్జిబిషన్‌లో చూడాలి. హత్యల్లో ఉపయోగించిన అనేక వందల కత్తులు, ఈటెలు, బాకులు, పిస్తోళ్ళు. తాళ్ళు వున్నాయి. మనలాంటి వాళ్ళకి అది ఒక గొప్ప ఇన్‌స్పిరేషన్ అనుకో."

"చూస్తుంటే చీకటి పడేదాకా మనం వాడిని ఇలా వెంటాడాలిలా వుంది."

"అవును. బయట పడ్డాకే వాడి పనిపట్టాలి. అక్కడ మన బాస్ ప్రభాకరన్‌లాగ వెయిట్ చేస్తుంటారు మనకోసం."

"ప్రభాకరన్ ఎవరు?"

"ఎల్.టి.టి.ఇ నాయకుడు. శ్రీలంక లిబరేషన్ సంగతి ఎలా వున్నా తన ఆజ్ఞ ప్రకారం జరిగిన హత్యాకాండను చూడాలని ఫోటోలు తీయిస్తుంటాడు. వాడికి వున్న ఆ పిచ్చివల్లే రాజీవ్ గాంధీ హత్యకి పథకం వేసిన శివరాసన్‌ని వేటాడి పట్టుకోగలిగారు."

"మన బాస్ కూడా ఫోటోలు తీయమన్నాడా?"

"అదికాదు. వాడు చచ్చేముందు పెద్ద స్పీచ్ ఇవ్వాలని ఆయనగారికి వుంది. లేకపోతే ఒకే ఒక్క బుల్లెట్‌తో ఈపాటికి వాడిని పైకి పంపించేసి వుండేవాళ్ళం. మనకు ఈ మ్యూజియం ప్రదక్షిణయోగం తప్పేది" విసుగ్గా చెప్పాడు తాతాచారి.

మ్యూజియం మూసేసే టైముకి ముప్పాతిక భాగమే చూశాడు శివాజీ.

మళ్ళీ ఇంకొక రోజు వచ్చి మిగిలిన భాగం కూడా చూడాలనుకున్నాడు. హైదరాబాద్‌లో అంత పెద్ద మ్యూజియం ముఖ్యంగా అపూర్వమైన సేకరణలతో వుందని శివాజీకి తెలియదు.

బయటికి వచ్చేటప్పటికి సూర్యాస్తమయం అయింది. వారానికి, పదిరోజులకి ఒక సిగరెట్ తాగుతుంటాడు శివాజి. అది ఫారిన్ సిగరెట్. బయట కిళ్ళీ షాపులో త్రిబుల్ ఫైవ్ సిగరెట్ ప్యాకెట్ చూసి, ఒక సిగరెట్ కొని అంటించాడు. నెమ్మదిగా నడవసాగాడు. పక్కనే మూసినది. ఆ నదిలో నీళ్ళు లేవు.

అతను అలా పది అడుగులు వేయగానే ఎక్సయిటింగ్‌గా చెప్పాడు తాతాచారి, నిర్మానుష్యంగా వున్న ఆ రోడ్డుమీద నడిచి వెళుతున్న శివాజీని చూసి.

"ఇదే అదును."

సూరి వ్యాను స్టార్టు చేశాడు. కొద్ది క్షణాల్లో అది పేవ్‌మెంట్ మీద నడిచి వెళుతున్న శివాజీ పక్కకి చేరింది. చాలా నెమ్మదిగా వెళుతున్న వ్యానులో నుంచి కిందకు దూకారు తాతాచారి, రాములు. ఇద్దరి చేతులలో టవల్స్ సిద్దంగా వున్నాయి.

వ్యాను నెమ్మదిగా వెళుతుండటంతో తలతిప్పి చూసిన శివాజీకి తాతాచారి, రాములు తనవైపు వస్తుండటం కనిపించింది.

వాళ్ళని వెంటనే గుర్తుపట్టి ముందుకు పరిగెత్తాడు. శివాజీ జరగబోయేది వూహించి. వాళ్ళిద్దరూ అతని వెంటపడ్డారు. అయితే మెరుపులా వేగంగా పరుగెత్తుకున్నాడు శివాజీ. శివాజీలాగా చురుగ్గా పరుగెత్తలేకపోయాడు నలభయ్యవ వడిలో పడుతున్న తాతాచారి.

జరిగేది చూస్తున్న సూరి వ్యాన్ వేగాన్ని పెంచి ముందుకి తీసుకువెళ్ళి శివాజీకి కొద్దిగా ముందుకి ఆపాడు. వ్యాన్‌లో నుంచి దిగి, పరుగెత్తి వస్తున్న శివాజీకి అడ్డం వెళ్ళి ఆపాడు. ఇద్దరూ కొట్టుకుంటూ పేవ్‌మెంట్ మీద పడ్డారు.

క్షణాల్లో తాతాచారి, రాములు వచ్చి శివాజీ మొహం మీద టవల్ కప్పారు.

ఇదివరకటిలాగా అదే తియ్యటి వాసన అని గుర్తించాడు శివాజీ.

క్లోరోఫాం పనిచేయడంతో అతనికి స్పృహ తప్పింది. శివాజీని ఎత్తుకుని వ్యాన్‌లోకి ఎక్కించారు. అటునుంచి వెళ్ళే ఒక లారీ స్లో అయింది."

"ఏమైంది?" అడిగాడు లారీ డ్రైవర్ తల బయటికి పెట్టి.

"ఒక పెగ్ ఎక్కువైంది" నవ్వుతూ బదులు చెప్పాడు రాములు.

లారీ డ్రైవర్ బదులుగా నవ్వి, లారీ ముందుకు పోనిచ్చాడు.

"బతికాం వీడు తప్పించుకుంటే మనం చచ్చేవాళ్ళం."

వ్యాన్ నాగార్జునసాగర్ రోడ్డులో వున్న కుమారస్వామి ద్రాక్ష తోటవైపు బయలుదేరింది. వ్యాన్‌లోని ఐస్ బాక్స్‌లో నుంచి ఆ సందర్భం కోసం దాచి వుంచిన బీర్ సీసా తీసి ఓపెన్ చేశాడు తాతాచారి. చల్లటి బీర్ అతని గొంతు తడిపింది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in